



# కరపత్రం

SINCE 2014

శుక్రవారం నవంబర్ 29 2024 సంపుటి :0 సంచిక : 51 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4


## సర్వేలో సీఎం వివరాలు నమోదు





- సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వివరాలు నమోదు చేయించుకున్నారు.
- ఎన్యుమరేటర్‌లు, అధికారులు ఆయన వివరాలు నమోదు చేసుకున్నారు.

2లో

## సమస్యలపై అధ్యయనం..

### తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్రవ్యాప్త పర్యటన



# ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు: సీఎం రేవంత్‌రెడ్డి



తరచూ స్కూళ్లు, హాస్టళ్లను తనిఖీ చేయాలి

పిల్లల ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు : సీఎం రేవంత్‌రెడ్డి

విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అంచించాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తరచూ స్కూళ్లు, గురుకులాలను తనిఖీ చేయాలన్నారు. వసతి గృహాల్లో ఆహార కల్తీకి బాధ్యులైనవారి వేటు వేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల స్కూళ్లలో ఉన్న విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలని, వారికి రిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించి చోటుచేసుకుంటున్న ఘటనలపై ముఖ్యమంత్రి పలుమార్లు సమీక్షించారు. కలెక్టర్లు తరచూ పాఠశాలల, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. అనంతరం అందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సీఎం ఆదేశించారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడమని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

> రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ”

తరువాయి పేజి 2లో

## గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కారణాలు తేల్చేందుకు టాస్క్‌ఫోర్స్



హైదరాబాద్: ఇటీవల గురుకులాల్లో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ కేసులకు సంబంధించి కారణాలు తేల్చేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఫుడ్ సేఫ్టీ కమిషనర్, అదనపు డైరెక్టర్, జిల్లా స్థాయి అధికారితో కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

2లో

## పార్టీ ఫిరాయింపులపై కేఏ పాల్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది.
- పార్టీ మారిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఆదేశించాలని కేఏ పాల్ పిటిషన్ పిటిషన్‌లో



2లో

## సీఎంఆర్ కాలేజీ యజమానికి బెదిరింపులు..

## బీఆర్ఎస్వీ నేత ప్రశాంత్ అరెస్ట్



హైదరాబాద్: భారాస విద్యార్థి సంఘం నేత ప్రశాంత్‌ను నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. ప్రశాంత్‌తో పాటు మరో పది మంది సీఎంఆర్ కాలేజీ యజమాని ఇంటికి వెళ్లి రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. దీనిపై సీఎంఆర్ కాలేజీ యజమాని ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌తో పాటు మరో పది మందిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇవాళ నిందితులను అరెస్టు చేసి రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు తెలిపారు.

# కేటీఆర్.. దిలావర్‌పూర్ రండి.. అక్కడే తేలుద్దాం:




భారాస హయాంలోనే నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమకు అనుమతులు ఇచ్చారని మంత్రి సీతక్క అన్నారు.

హైదరాబాద్: ఈ విషయంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే పరిశ్రమకు అనుమతులు ఎవరు ఇచ్చారో మాట్లాడదామని..

2లో

# మూసీ పునరుజ్జీవానికి మేం వ్యతిరేకం కాదు..


## మూసీ పేరుతో చేసిన రియల్ ఎస్టేట్‌కు వ్యతిరేకం : హరీశ్‌రావు

- ప్రజలు, పార్లమెంటును సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు.
- ముఖ్యమంత్రి, మున్సిపల్ మంత్రి రేవంత్ రెడ్డే అని తెలిపారు. సంబంధిత శాఖ మంత్రి సంతకంతోనే పార్లమెంటుకు సమాధానం వెళ్తుందని పేర్కొన్నారు.
- అంటే ఆయనకు తెలిసి కూడా కేంద్రానికి తప్పుడు సమాచారం అందించారని మండిపడ్డారు.
- కొత్తగా ఇండ్లను కూల్చబోమని అంటున్నారని.. మరి కూల్చిన వాటి సంగతేంటని ప్రశ్నించారు.
- వాళ్ల అనుభవించిన క్షోభ

హైడ్రా పేరిట పేదల ఇండ్లను కూల్చారని హరీశ్‌రావు తెలిపారు. చిన్న పాప పుస్తకాలు తెచ్చుకుంటా అంటే ఊరుకోకుండా.. ఇండ్లు కూల్చేశారని.. దీనికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. పరిహారం ఇచ్చినా సరే వారు పడిన బాధ పోదని అన్నారు. కట్టుబట్టలతో ఇండ్ల నుంచి బయటకు గెంటేశారని.. మూసీ విషయంలోనూ అదే పరిస్థితి నెలకొందన్నారు. కూలిన ఇండ్లకు నష్టపరిహారం ఎలా చెల్లిస్తావని ప్రశ్నించారు. దుందుడుకు చర్యలతో పేదల ఉసురు తీసుకుంటున్నావని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. రాష్ట్రం పరువు తీస్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వదిలిపెట్టదని స్పష్టం చేశారు.

280 కుటుంబాల ఇండ్లను కూల్చేసినమని అంటున్నారని హరీశ్‌రావు తెలిపారు.





2లో

# సంపాదకీయం

## దారుణ విద్వేష క్రీడ!

అయిదు నెలలుగా బంగ్లాదేశ్‌లో అల్పసంఖ్యాకులపై అల్లర్లు సాగుతూనే ఉన్నాయి. హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ ఆ దేశంలో మైనారిటీలు ఎదుర్కొంటున్న పెను సవాళ్ళకు తాజా ఉదాహరణ. మైనారిటీల హక్కుల కోసం బలంగా గళం విప్పే దాస్ బంగ్లాదేశీ జాతీయ పతాకాన్ని అవమానించారంటూ రాజద్రోహ నేరం మోపడం విడ్డూరం. ఆయనను మంగళవారం అరెస్ట్ చేసి, బెయిలివ్వకుండా, పది రోజుల కస్టడీకి పంపడంతో నిరసనలు చెలరేగాయి. సందట్లో సడేమియాగా దుష్టశక్తులు అల్లర్లు రేపి, పొరపాటున ఓ ముస్లిమ్ లాయర్ మరణానికి కారణమై, ఆ పాపం మైనా రిటీల నెత్తిన వేయడంతో ఢాకా మరోసారి భగ్గుమంది. ఆలయాలపై దాడులు, ప్రాణనష్టంతో... మైనారిటీలనూ, భావప్రకటనాస్వేచ్ఛనూ కాపాడాలంటూ బంగ్లాను భారత్ అభ్యర్థించాల్సొచ్చింది. ఇస్లామ్ అధికారిక మతమైనా, లౌకికవాద, ప్రజాస్వామ్య దేశంగా, సమానత్వానికి రాజ్యాంగ బద్ధులమని చెప్పుకొనే బంగ్లా ఆ మాటకు తగ్గట్టు వ్యవహరించడం మానేసి, చాలాకాలమైంది. అందుకు తగ్గట్టే తాజాగా 'ఇస్కాన్'ను ర్యాడికల్, మత ఛాందసవాద సంస్థ అని బంగ్లా అటార్నీ జనరల్ బుధవారం అభివర్ణించడం ఆందోళనకరం. 'ఇస్కాన్'ను నిషేధించాలని బంగ్లా యోచిస్తు న్నట్టు వార్త. ఆధ్యాత్మిక చైతన్యం, పీడిత జన సముద్ధరణ కోసం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాల్లో పనిచేస్తున్న ఒక సంస్థపై అలాంటి నిర్ణయం తీసుకోవాలనుకోవడం అక్షరాలా బుద్ధిహీనతే. దేశంలోని విభిన్న వర్గాల మధ్య సౌహార్దం పెంపొందించి, బాధితులకు న్యాయం చేసి, మానవ హక్కుల్ని కాపాడాల్సిన ప్రభుత్వం ఏ శక్తుల ప్రోద్బలంతో ఇలా మాట్లాడుతోందన్నది ఆశ్చర్యకరం. జూలై నాటి ప్రజా ఉద్యమంతో ఢాకాలో ప్రభుత్వ మార్పు జరిగిపోయింది కానీ, అల్పసంఖ్యాక వర్గాలపై సాగుతున్న దాడులు మాత్రం అప్పటి నుంచి ఆగడం లేదు. మైనారిటీలను పూర్తిగా తరిమేసి, బంగ్లాను హిందూ రహిత దేశంగా మార్చాలనే పన్నాగం దీనికి వెనక ఉందని స్థానిక స్వతంత్ర విశ్లేషకుల మాట. ఈ అల్లర్లు, అల్పసంఖ్యాక హిందువులపై దాడుల వెనుక మత ఛాందస జమాతే ఇస్లామీ ఉందనేది స్పష్టం. హసీనా సర్కారు కాలంలో నిషేధానికి గురైన ఈ ర్యాడికల్ గ్రూపు, అలాగే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)లు యూనస్ యంత్రాంగంలో భాగమే. అసలు ఈ ప్రయత్నమంతా ఇస్లామిక్ షరియత్‌ను ప్రవేశపెట్టి, బంగ్లాదేశ్‌ను ప్రజాస్వామ్య ఎన్నికలు, పార్ల మెంట్‌తో పని లేని దేశంగా మార్చాలనే వ్యూహంలో భాగమని ఒక వాదన వినిపిస్తోంది. అదే గనక నిజమైతే, అత్యంత ప్రమాదకర పరిణామం. పౌరసమాజం, రాజకీయ నేతలు, ప్రజలు కలసి కట్టుగా అలాంటి వ్యూహాలను భగ్నం చేసి, కష్టించి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలి. అసలు అఫ్ఘన్ లాగానే బంగ్లాను తమ ప్రయోగశాలగా చేసుకోవాలని పాశ్చాత్య ప్రపంచం భావిస్తున్నట్టుంది. అప్పుడిక బంగ్లా మరో తీవ్రవాద కేంద్రంగా మారే ప్రమాదముంది. అది భారత్‌కే కాదు... యావత్ ప్రపంచానికి నష్టం. నిజానికి, ఆసియా %–% పసిఫిక్ కూటమిలో బంగ్లాను భాగం చేసుకొని, లబ్ధి పొందాలని అమెరికా భావించింది. నిరుటి హసీనా సర్కార్ నో చెప్పడంతో అది కుదరలేదు. మొన్నటి అమెరికా ఎన్నికల్లో కమలా హ్యారిస్ గెలిచి ఉంటే ఏమో కానీ, ట్రంప్ గెలవడంతో బంగ్లా మధ్యంతర సర్కార్ సారథి – ట్రంప్ ద్వేషి ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. ట్రంప్ పగ్గాలు చేపట్టాక బంగ్లాపై కఠినవైఖరి అవలంబిస్తారని యూనస్‌కు తెలుసు. అందుకే, ఆలోగా మైనారిటీలపై అల్లర్లను ఆఖరి అస్త్రంగా చేసుకున్నారట. బంగ్లా ప్రజల ఆశలు, ఆకాంక్షలను గుర్తించి, స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరణకు అయిదు దశాబ్దాల పైచిలుకు క్రితం భారత్ అండగా నిలిచింది. కానీ, ఇప్పుడు అదే గడ్డపై భారత వ్యతిరేకత, మైనారిటీలపై ద్వేషాలను స్వార్థపరులు పెంచిపోషించడం విషాదం. దాదాపు 14 ఏళ్ళ పైగా షేక్ హసీనా ఏలుబడిలో నియంత పోకడల వల్ల మానవ హక్కుల ఉల్లంఘన, అణచివేత సాగిందని ఆరోపణలొస్తే, కొత్త హయాం కూడా తక్కువేమీ తినలేదు. విజృంభిస్తున్న విద్వేషం, విధ్వంసం ఢాకాలో పత్రికా స్వాతంత్ర్యానికి సైతం ముప్పుగా మారాయి. 'ప్రథమ్ ఆలో', 'ది డైలీ స్టార్'లాంటి స్వతంత్ర పత్రికా రచనకు పేరుపడ్డ పత్రికలపై దాడులు అందుకు ఓ మచ్చుతునక. బాధిత లకు సత్వర న్యాయం కోసం ప్రత్యేక ట్రిబ్యునళ్ళ ఏర్పాటు సహా మైనారిటీల కనీసపాటి ఆకాంక్షల్ని నెరవేర్చడానికి బంగ్లా సర్కార్‌కు ఉన్న కష్టమేమిటి? హసీనా సర్కార్‌ను గద్దె దింపినప్పటి నుంచి ఇప్పటికి బంగ్లాలో మైనారిటీలపై 2 వేలకు పైగా దాడులు జరిగాయి. హిందూ, బౌద్ధ, క్రైస్తవ సోదరులపై జరుగుతున్న ఈ దౌర్జన్యకాండను మతపరంగా కాక మానవ హక్కుల పరంగా చూడాలి. అప్పుడే సమస్య తీవ్రత అర్థమవుతుంది. 1930లో బంగ్లాలో 30 శాతం పైగా ఉన్న హిందువులు ఇప్పుడు కేవలం 8 శాతం చిల్లరకు పడిపోయారన్న నిష్ఠుర సత్యం అక్కడ జరుగుతున్నదేమిటో ఎరుకపరుస్తుంది. విద్యుత్ సహా, బియ్యం, పత్తి, చమురు లాంటి అనేక సరుకుల విషయంలోనూ మనపై భారీగా ఆధారపడ్డ బంగ్లా సర్కార్‌పై ఇకనైనా భారత్ కఠినవైఖరిని అవలంబించాలి. పొరుగు దేశంలో బతుకు భయంలో ఉన్న హిందువులను కాపాడేందుకు క్రియాశీలంగా వ్యవహరించాలి. కేవలం మాటలకు పరిమితం కాకుండా, దౌత్య, వాణిజ్య రంగాల్లో చేయగలిగినదంతా చేయాలి. పేరుకు మాత్రం లౌకికవాదం ముసుగు వేసుకొని, మైనారిటీలకు వ్యతిరేకంగా, తెర వెనుక శక్తుల చేతుల్లో కీలుబొమ్మగా మిగిలిన అసమర్థ యూనస్ సర్కార్‌పై అంతర్జాతీయంగానూ ఒత్తిడి తేవాలి. అప్పుడే ఫలితం ఉంటుంది.

## గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కారణాలు తేల్చేందుకు టాస్క్‌ఫోర్స్

మొదటిపేజీ తరువాయి
గురుకులాలు, హాస్టళ్లు, అంగన్వాడీలు, ఆసుపత్రుల్లో ఆహార నాణ్యతను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది. ఫుడ్ పాయిజన్ జరిగినప్పుడు కారణాలు తేల్చి, బాధ్యులను గుర్తించనుంది.
పాఠశాల ఫుడ్ సేఫ్టీ కమిటీలో హెడ్ మాస్టర్, ఇద్దరు పాఠశాల సిబ్బంది ఉంటారని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వంట చేసే ముందు కిచెన్ పరిశీలించి పరిశుభ్రత నిర్ధారించాలి, ఫుడ్ సేఫ్టీ కమిటీ రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు ఆహారం వడ్డించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

## సమస్యలపై అధ్యయనం..

### తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్రవ్యాప్త పర్యటన

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర వ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో మెరుగైన విద్య అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, వెంకటేశ్, జ్యోత్స్నలు పర్యటన చేపట్టారు. గురువారం నుంచి డిసెంబరు 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో పర్యటించి.. అక్కడి పరిస్థితులను కమిషన్ సభ్యులు పరిశీలించనున్నారు. ఇవాళ సంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్‌లలో కమిషన్ పర్యటించనుంది. ఈ నేపథ్యంలో కమిషన్ పర్యటనకు సహకరించడంతోపాటు.. అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

## పార్టీ ఫిరాయింపులపై కేఏ పాల్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

మొదటిపేజీ తరువాయి
వారు అసెంబ్లీ నిర్ణయాల్లో జోక్యం చేసుకోకుండా, తీర్మానాల్లో ఓటు వేయకుండా ఆదేశించాలన్నారు. దానం నాగేందర్ గత పదేళ్లలో కాంగ్రెస్, భారాస పార్టీలు మారుతూ వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు ఇలా పార్టీలు మారితే ప్రజాస్వామ్యంపై నమ్మకం పోతుందని చెప్పారు. వాళ్లపై చర్యలు తీసుకోపోతే ఎమ్మెల్యేలు పార్టీ మారడం సహజమైపోతుందని కేఏ పాల్ వ్యాఖ్యానించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం స్పీకర్ పరిధిలో ఉందని హైకోర్టు చెప్పింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని ఇటీవల తీర్పులో వెలువరించామని పేర్కొంది. స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే ఆ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా ఆదేశించలేమని స్పష్టం చేసింది.

## ప్రియాంక అనే నేను..:

### లోక్‌సభ ఎంపీగా ప్రమాణం చేసిన కాంగ్రెస్ నాయకురాలు

ఇటీవల వయనాడ్ నుంచి ఎన్నికైన ప్రియాంక పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు.



దిల్లీ: కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఇటీవల కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ఆమె.. గురువారం ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. సోదరుడు, ఎంపీ రాహుల్ గాంధీ, ఇతర నేతలు వెంట రాగా.. కేరళ సంప్రదాయాన్ని ప్రతిబింబించే 'కసావు' చీర ధరించి ప్రియాంక సభకు వచ్చారు. నేడు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్యాంగ ప్రతిని చేతబూని ఆమె ఈ ప్రక్రియను పూర్తిచేశారు.
ప్రత్యక్ష ఎన్నికల్లో అరంగేట్రం చేసిన కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ .. తొలి అడుగులోనే భారీ విజయాన్ని నమోదు చేశారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో తన సమీప ప్రత్యర్థిపై 4,10,931 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఇదే స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన (3.64 లక్షలు) మెజార్టీని ఆమె అధిగమించారు. ఎంపీ హోదాలో మొదటిసారి లోక్‌సభలోకి అడుగుపెట్టారు.
వయనాడ్‌లో విజయంతో.. నెహ్రూ–గాంధీ కుటుంబంలో దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహించిన మూడో వ్యక్తిగా ప్రియాంక గుర్తింపు పొందారు. ఇదివరకు ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహించారు. సోనియా గాంధీ కూడా కర్ణాటకలోని బళ్లారి నుంచి పోటీ చేసి విజయం సాధించినప్పటికీ.. అమేఠీలోనూ గెలిచిన ఆమె ఆ తర్వాత దాన్ని వదులుకున్నారు. ఇక, ప్రియాంక రాకతో ఇప్పుడు ఒకేసారి ముగ్గురు నెహ్రూ–గాంధీ కుటుంబ సభ్యులు పార్లమెంటు ఎంపీలుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సోనియా గాంధీ రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. రాహుల్ రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ప్రియాంక (%భాతీఱఖుఅఝ +ఖుఅస్త్రఱ%)తో పాటు నాందేడ్ ఉప ఎన్నికలో విజయం సాధించిన కాంగ్రెస్ నేత రవీంద్ర వసంతరావ్ చవాన్ కూడా నేడు ప్రమాణం చేశారు.

**కొనసాగుతున్న వాయిదాల పర్వం**

మరోవైపు, అదానీ వ్యవహారంతో ఉభయసభల కార్యకలాపాలకు గురువారం కూడా అంతరాయం కలిగింది. దానిపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో తొలుత వాయిదా పడిన రెండు సభలు మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి ప్రారంభమయ్యాయి. అయితే పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో తిరిగి శుక్రవారానికి వాయిదాపడ్డాయి.

## దిల్లీ పీవీఆర్ మాల్ సమీపంలో బాంబు పేలుడు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో మరోసారి బాంబు పేలుడు కలకలం సృష్టిస్తోంది. రోహిణి ప్రాంతంలోని ప్రశాంత్ విహార్‌లో గల పీవీఆర్ మల్టీప్లెక్స్ సమీపంలో గురువారం ఉదయం భారీ పేలుడు శబ్దం వినిపించింది. దీంతో స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సమాచారమందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.
ఈ ఘటనలో ఓ ఆటోరిక్షా డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు చేపట్టారు. పేలుడు జరిగిన ప్రాంతంలో తెలుపు రంగు పొడిని గుర్తించారు. తక్కువ తీవ్రత కలిగిన బాంబు పేలి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.
కాగా.. సరిగ్గా నెలరోజుల క్రితం ఇదే ప్రాంతంలోని సీఆర్పీఎఫ్ పాఠశాల ఎదుట పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. పేలుడు ధాటికి ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించడంతో పాటు, పాఠశాల గోడ కూలిపోయింది. సమీపంలోని దుకాణాలు, కార్లు దెబ్బతిన్నాయి. అప్పుడు కూడా ఘటనాస్థలంలో తెల్లని పౌడర్‌ను గుర్తించి ల్యాబ్‌కు పంపించారు.
దీని వెనక ఖలిస్థానీ హస్తం ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ పేలుడుకు పాల్పడింది తామేనంటూ ఖలిస్థానీ అనుకూల గ్రూప్ 'జస్టిస్ లీగ్ ఇండియా' ప్రకటించుకుంది. తాజా పేలుడు కూడా అచ్చం నాటి ఘటన లాగే ఉండటం కలకలం రేపుతోంది. అయితే, ప్రస్తుతానికి ఈ రెండింటికీ సంబంధం ఉందనే నిర్ణయానికి రాలేమని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

## ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసేందుకు

### యత్నిస్తే కఠిన చర్యలు: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వసతిగృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించడంతో పాటు లేని వార్తలను ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని.. వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మూసీ పునరుజ్జీవానికి మేం వ్యతిరేకం కాదు..

మొదటిపేజీ తరువాయి
ఓల్డ్ మలక్‌పేట శంకర్‌నగర్‌లో ఒక ఇంట్లో 16 కుటుంబాలు ఉంటున్నాయని తెలిపారు. ఆ ఇల్లు కూల్చేసి, కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తే వాళ్లు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మానవత్వంతో ఇండ్లు ఇస్తున్నామని పార్లమెంటుకు చెప్పారని.. మానవత్వంతో కాదు.. హక్కుగా ఇవ్వాలని చెప్పారు. ఇల్లు పొందడం నిర్వాసితుల రాజ్యాంగ హక్కు అని స్పష్టం చేశారు.
సీఎం రేవంత్ రెడ్డి గతంలో సోనియా గాంధీని బలి దేవత అన్నాడని.. ఇప్పుడు తల్లి అంటున్నాడని హరీశ్‌రావు విమర్శించారు. నిజంగా ఆమె మీద గౌరవం ఉంటే సోనియా గాంధీ తెచ్చిన భూసేకరణ చట్టం 2013ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మూసీ బాధితులకు పరిహారం విషయంలో పార్లమెంటుకు చెప్పిన అంశాలపై చర్చించేందుకు సిద్ధమని తెలిపారు. ఎక్కడికి రావాలో ముఖ్యమంత్రి చెప్పాలని సవాలు విసిరారు.
బుల్డోజర్ ఎక్కించి చంపుతా, తొక్కుతా అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం కాదని హరీశ్‌రావు అన్నారు. దీనికి ఎక్కడికి రావాలన్నా సిద్ధమేనని బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. టీవీ చానల్‌కు వెళ్దామా.. సచివాలయానికి రావాలా అని అడిగారు. అఖిలపక్ష సమావేశం పెట్టాలని కేటీఆర్ చెప్పారని.. తాను కూడా చెప్పానని గుర్తుచేశారు. అఖిలపక్ష సమావేశం ఎందుకు పెట్టలేదని నిలదీశారు. పార్లమెంటును తప్పుదోవ పట్టిస్తున్నావని.. సోనియాగాంధీని తప్పుదోవ పట్టిస్తున్నావని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవానికి తాము వ్యతిరేకం కాదని హరీశ్‌రావు తెలిపారు. మూసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. మూసీ ముసుగులో రాష్ట్ర ప్రభుత్వ నిధులు కొల్లగొట్టడానికి వ్యతిరేకమని చెప్పారు. మూసీ ప్రాజెక్టు ప్రారంభించిందే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. అవాసత్వాలు చెప్పడం మీద పార్లమెంటులో ప్రివిలేజ్ మోషన్ ఇస్తామని చెప్పారు. మూసీ పేదల పక్షాన న్యాయస్థానాలకు వెళ్తామని అన్నారు. చట్టం ప్రకారం ఆ పేదలకు సాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. మూసీ పేదల పక్షాన అసెంబ్లీలో కూడా పోరాడతామని స్పష్టం చేశారు. మూసీ బాధితులకు పూర్తిగా అండగా ఉంటామని.. పోరాటం చేస్తామని తెలిపారు.

## సర్వేలో సీఎం వివరాలు నమోదు

మొదటిపేజీ తరువాయి
ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వే పురోగతిపై సీఎం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని ఆరా తీశారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## కేటీఆర్.. దిలావర్‌పూర్ రండి.. అక్కడే తేలుద్దాం:

మొదటిపేజీ తరువాయి



దిలావర్‌పూర్ రావాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో గాంధీభవన్ వద్ద సీతక్క మీడియాతో మాట్లాడారు.
"భారాస హయాంలో ఎన్నో పరిశ్రమలకు కనీసం గ్రామసభలు కూడా నిర్వహించకుండా అనుమతులు ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన లక్షల ఎకరాల అసైన్డ్ భూములను రియల్ ఎస్టేట్ కోసం తీసుకున్నారు. ఇప్పుడు మాత్రం గ్రామసభల్లో ఒకరిద్దరిని రెచ్చగొట్టి అధికారుల పైకి ఉసిగొల్పుతున్నారు. ఇథనాల్ పరిశ్రమలో డైరెక్టర్‌గా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకుడు ఏపీకి చెందిన పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు ఉన్నారు. ఆ పరిశ్రమకు అనుమతులు ఇచ్చే సమయానికి మరో డైరెక్టర్‌గా తలసాని కుమారుడు సాయి ఉన్నారు.
కేటీఆర్.. ఎక్కడెక్కడో తిరగడం ఎందుకు?ఆందోళన జరుగుతున్న ప్రాంతానికే వెళ్దాం. ఎవరు అనుమతులు ఇచ్చారో అక్కడే తేలుద్దాం. మీ హయాంలోనే పరిశ్రమకు అనుమతులు ఇచ్చినట్లు ఇప్పటికైనా ఒప్పుకోండి. ఈ అంశంపై ఆధారాలతో సహా త్వరలోనే వాస్తవాలు వెల్లడిస్తాం. అసెంబ్లీలో దీనిపై చర్చ పెడతాం. తప్పుడు ప్రచారాలతో ఎక్కువ రోజులు మనుగడ సాగించలేరు" అని సీతక్క మండిపడ్డారు.

**కుట్రదారులను బయటపెడతాం**

హాస్టళ్లలో వరుస ఘటనల వెనక కుట్ర ఉన్నట్లు భావిస్తున్నామని సీతక్క అన్నారు. దీనిపై విచారణ జరిపి కుట్రదారులను బయటపెడతామని.. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అవసరమైతే అధికారులను సర్వీసు నుంచి తొలగిస్తామని మంత్రి హెచ్చరించారు.

## రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంథని జేఎన్టీయూలో ఉచిత వైద్య శిబిరం



**కరపత్రం రామగిరి ప్రతినిధి నవంబర్ 28**
హైద్రాబాద్కు చెందిన సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా వైద్యాధికారి అనుమతితో ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉచితంగా నిర్వహిస్తున్న వైద్య పరీక్షల్లో భాగంగా మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన క్యాంపుకు అపూర్వ స్పందన లభించింది. గురువారం కళాశాలలోని ఇండోర్ గేమ్స్ షెడ్లో విద్యార్థులకు దంత, రక్తహీనత వైద్య పరీక్షల క్యాంపును ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించగా వేయి ముందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షలు చేయించుకునేందుకు విద్యార్థులు బారులు తీరారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఉచితంగా మందులు అందజేశారు. ఎన్టీపిసి సౌజన్యంతో నిర్వహిస్తున్న క్యాంపుల్లో దంత వైద్య పరీక్షలు చేసుకున్న ప్రతి విద్యార్థికి కిట్లు ఇస్తున్నామని, మంథని జేఎన్టియు విద్యార్థులకు రెండు రోజుల్లో ఇవ్వనున్నట్టు రోహిణి ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కళాశాలలోని విద్యార్థులకు సేవా దృక్పథంతో ఉచితంగా వైద్య సేవలందించి మందులు అంచజేసినందుకు ప్రిన్సిపల్ రోహిణి ఫౌండేషన్కు కృతజ్ఞతలు. తెలిపారు. కార్యక్రమంలో పింగిళి కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ సదానందం, శ్రీధర్, పరిపాలనాధికారి చినాల. సుమన్, డిస్పెన్సరీ ఇంచార్జ్ రమేష్, వైద్యులు అలేఖ్య, వంశీకృష్ణ, సంగీత, ప్రీతి, సౌశిల్య, చందన, నిధిన్, దీపిక, అమృత, శ్వేత, శివాని, ఉమ, భార్గవి, కళాశాల టీచింగ్, నాన్టీచింగ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్.జి.3 మహిళా ఉద్యోగులకు కౌన్సిలింగ్



**కరపత్రం రామగిరి ప్రతినిధి నవంబర్ 28**
సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు గనులు, విభాగాలలో వారికోసం గుర్తించబడిన హోదాలలో పనిచేస్తూ, పదోన్నతులు పొందేందుకు ఉన్నటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం-3 ఏరియా ఎస్వోటుజియం గుంజపడుగు రఘుపతి అన్నారు.రామగుండం-3 ఏరియాలోని ఓసిపి-2 ఉపరితల గనిలో బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు గురువారం నాడు సంబంధిత కమిటీ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. వారికి సర్ఫేస్ లో పని చేసేందుకు వీలుగా ఉన్నటువంటి 16 రకాల పోస్టుల గురించి క్షుణ్ణంగా తెలియజేసి, ఆ హోదాలలో ఉండే పని విధానాన్ని కూడా వివరించారు.ఈ కౌన్సిలింగ్ కు మొత్తం 10 మంది మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్ ఉద్యోగులు హాజరయ్యారు. దీని ఆధారంగా మహిళా ఉద్యోగులు ఎంచుకున్న పోస్టులకు సంబంధించిన శిక్షణను అందించి, విధులకు పంపించడం జరుగుతుందని అన్నారు. కావున మహిళా ఉద్యోగులందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రయోజనంతో పాటు, భవిష్యత్తులో పదోన్నతులు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ సి.హెచ్.వెంకటరమణ, ఐఈ డిజియం కె.చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృపానంద్ భాస్కర్, సంక్షేమాధికారి బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల పోరాట యోధుడు ఫూలే

**- మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి**

**కరపత్రం శంకరపట్నం నవంబర్ 28**



సమాజంలోని రుగ్మతల వల్ల అన్నిరకాలుగా అణచివేత గురైన బడుగు, బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు జ్యోతీరావు ఫూలే అని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు. ఫూలే వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులర్పిస్తూ గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.కుల వివక్షకు వ్యతిరేకంగా పేద, అణగారిన, అంటరాని ప్రజల హక్కుల కోసం జ్యోతీరావు ఫూలే తెగించి పోరాడారని ఎమ్మెల్యే సత్యనారాయణ పేర్కొన్నారు.అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు చేసిన కృషి ఎంతో ఉదాత్త మైనదని ఆయన పేర్కొన్నారు. సామాజిక సంస్కరణ ఉద్యమంలో ఫూలే ఒక ముఖ్యమైన భూమిక పోషించారని ఎమ్మెల్యే సత్యనారాయణ గుర్తు చేశారు. దురాచారాలను రూపుమాపటానికి అహర్నిశలు కృషి చేశారని, ఎవరు ఎన్ని రకాలుగా వేధించినా లెక్క చేయక పీడిత ప్రజల కోసం సత్యశోధక్ సమాజ్ ను స్థాపించారని, అంతేకాకుండా ప్రజలను జాగృతపర్చేందుకు దీన బంధు పత్రికను వెలువరించారని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి గుర్తు చేశారు. సామాజిక రుగ్మతలను పోరుకు చదువే మార్గమని భావించిన జ్యోతీరావు ఫూలే విద్యావ్యాప్తికి, ముఖ్యంగా బహుజనలకు విద్యనందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని ఆయన కొనియాడారు. ఆ మహనీయుని ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు.

# గురువారం సందర్భంగా బాబా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం

**- ఆకలి అనువారికింత అన్నం పెడదాము**
**- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్**
**- 1314 రోజులుగా దాతల సహకారంతో పేదలకు, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం**





**కరపత్రం ప్రతినిధి వేములవాడ నవంబర్ 28**
దాతల సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో 1314 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున లక్ష్మీగణపతి కాంప్లెక్స్, రాజన్న, భీమేశ్వర మరియూ సాయినగర్ బాబా ఆలయం వద్ద పేదలకు,మరియూ అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా కుమారుని జన్మదినోత్స వాన్ని పురస్కరించుకుని రామడుగు శరత్ చంద్ర ప్రజ్ఞ దంపతులు, జీ తెలుగు న్యూస్ చీఫ్ ఎడిటర్ భరత్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బండి శ్రీకాంత్ , తిప్పర్తి జగన్ చారి రాధ దంపతులు, తిప్పర్తి సాయిరాం సౌమ్య దంపతులు, మహారాష్ట్ర సిన్నార్ తాలూకా వాస్తవ్యులు బండారి రాజేందర్ మంగేశ్వరి (కళావతి) దంపతులు, జువ్వాడి స్నేహలత వెంకటేశ్వరరావు దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత,కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్ చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు ఉన్నారని ట్రస్టు నిర్వాహకులు తెలియజేశారు.అన్నదాన కార్యక్రమానికి శాశ్వత సభ్యత్వం పొందాలి అనుకునే అన్నదాతలు ట్రస్టు సభ్యులను గాని, ట్రస్టు ఫోన్ నం 92469 39388 నంబరు ద్వారా సంప్రదించాలని అలాగే మీ ఇంట్లో గాని, ఫంక్షన్ హాల్లో గాని తినే ఆహార పదార్థాలు మిగిలితే ట్రస్టు సభ్యులకు సమాచారం అందిస్తే వారు పేదలకు అన్నార్తులకు పంచిపెట్టడం జరుగుతుందని ట్రస్టు నిర్వాహకులు మహేష్ కోరారు.నేటి అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, ఓడ్యాల వేణు, చల్లా సత్తయ్య, ప్రతాప నటరాజు, సగ్గు రాహుల్, దురిశేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందజేయాలి...

**- ఇచ్చిన హామీలను అమలు చేయాలని దక్షిణ కాశి విజయ సంకల్ప యాత్ర ఫోరం ఆధ్వర్యంలో..**
**- వేములవాడకు బయలుదేరిన ఉద్యమకారుల సంకల్పయాత్ర...**
**- ఉద్యమకారుల ఫోరం సలహాదారు ఫుడ్ కమిటీ రాష్ట్ర సభ్యులు ఆనంద్.**







**కరపత్రం శంకరపట్నం నవంబర్ 28**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు, శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఉద్యమకారులకు స్వాతంత్ర సమరయోధుల మాదిరి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సలహాదారులు తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యులు ఆనంద్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దక్షిణ కాశీ గా పేరుందిన శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు, చేపట్టిన విజయ సంకల్ప యాత్ర గురువారం కరీంనగర్ పట్టణంలో అమరవీరుల స్థూపం నుండి బయలుదేరింది. ఈ సందర్భంగా ఆనంద్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షిస్తూ ఉద్యమకారులం ఏకమై పోరాడి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని నాటి ప్రభుత్వంలో ఉద్యమకారులను, ప్రజలను విస్మరించారని తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి 2023 శాసనసభకు జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజానీకం, ఉద్యమకారులు నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగించి, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆదరించి అక్కున చేర్చుకుని, ప్రభుత్వాన్ని కట్టబెట్టారని, నాడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షునిగా ఉన్న నేటి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గం జాతీయ నాయకత్వం, ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు నివాస గృహం కోసం, ఇతర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని హామీ ఇచ్చారని, ఎలాంటి షరతులు లేకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆకాంక్ష కోసం ముందుండి పోరాడిన ప్రతి ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులను అందజేయాలని, ప్రతి ఉద్యమకారుని కుటుంబానికి 10 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం అందజేయాలని, హైదరాబాద్ పట్టణంలో ఉద్యమకారుల ఫోరంకు మూడు ఎకరాల భూమి, భవన నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గము అమలుచేసి అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని, ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగాలని కోరుకుంటూ దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించాలని పోరాటాల పురిటి గడ్డ కరీంనగర్ పట్టణం నుండి నేడు తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన విజయసంకల్పయాత్ర, పాదయాత్ర బయలుదేరి శుక్రవారం వేములవాడ దక్షిణ కాశి రాజరాజేశ్వర స్వామి సన్నిధి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విజయసంకల్పయాత్ర, శాంతియుతంగా దైవ భక్తితో వేములవాడకు బయలుదేరిందని, ఉద్యమకారులు యాత్రలో ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొనకుండా ముందుకు సాగి, యాత్రను విజయవంతం చేసి రాజరాజేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకోవాలని ఆ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులు కోరుతున్నామని, వెల్లడించారు. యాత్రకు పోలీసులు తమ పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఉద్యమకారుల ఫోరం ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, నాయకులు పెద్దోళ్ల సురేందర్ రెడ్డి,సంజీవరెడ్డి,గుండేటి అయిలయ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు ఐల ప్రసన్న, పోతు జ్యోతి రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు దేవునూరి అంకుష్, భూమ సదానందం, సంజీవ్, చంద్రమౌళి,వస్తాదుల సదానందం, జిల్లా నాయకులు తాటిపల్లి శంకర్, మామిడి మొగిలి, కనుకం శంకర్లతోపాటు జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఎల్ పి లో ఐ ఎన్ టి యు సి గేట్ మీటింగ్

**కరపత్రం రామగిరి ప్రతినిధి, నవంబర్ 28.**
ఏ ఎల్ పి లో పిట్ కార్యదర్శి మందల కొమురయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వారక సమావేశానికి,అర్జీ-3 అండ్ ఏపీ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు యూనియన్ ఎలక్షన్ల ముందు చేసిన వాగ్దానం ప్రకారం ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, మినిమం వేజ్ బోర్డ్ కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్, కార్మిక సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, అదేవిధంగా మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కార కార్యక్రమాలు చేపడుతున్నారు అని, అన్ఫిట్ అయినా కార్మిక పిల్లలకు సింగరేణిలో చేరే వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు వయసు పెంచడం జరిగింది అని, గోదావరిఖనిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఓపెనింగ్ సిద్ధంగా ఉంది అని. రెండు గుంటల ఇంటి స్థలంతో పాటు ఇన్కమ్ టాక్స్ లో పెరిక్స్ మీద టాక్స్ రద్దు చేసే విషయం జనక్ ప్రసాద్ సిఎం దృష్టికి తీసుకెళ్లారు అన్నారు, మంత్రి శ్రీధర్ బాబు చొరవతోని సెంటినరీ కాలనీ నుండి గోదావరిఖని వరకు ఫోర్ వే రోడ్డు అదేవిధంగా సెంటనరీ కాలనీలో నీళ్ల కొరకు కార్మికులు పడుతున్న ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని పోతన కాలనీ నుండి సెంటనరీ కాలనీ వరకు అడిషనల్ గా పైప్ లైన్ 9 కోట్లతో వేయడం జరుగుతుందన్నారు. జి ఎం స్ట్రక్చర్ సమావేశంలో నిర్ణయించినటువంటి విషయం ఏ ఎల్ పి నుండి 150 మంది జనరల్ మజ్దూర్లను ఆర్జీ త్రి ఏరియాకు బదిలీ మీద పంపడం జరుగుతుందని అన్నారు,



సెంట్రల్ కార్యదర్శులు గడ్డం తిరుపతి యాదవ్, జిఎం స్ట్రక్చర్ సమావేశంలో చర్చలు జరిపిన విషయాలు వివరించారు కష్టపడి పని చేస్తున్న కార్మికులకు ప్రమోషన్స్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు, కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు జనక ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్తున్నామని చెప్పారు, ఎల్లంకి రామారావు, సి అండ్ ఎండి ని నిన్న లేఖ ద్వారా ఐఎన్టీయుసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ కార్మికులకు రావాల్సినటువంటి ప్రమోషన్స్, కార్మికులు నివసిస్తున్నటువంటి ఏరియాలలో రోడ్లు, నీటి వసతితోపాటు మౌలిక వసతులన్నీ ఇంప్లిమెంట్ చేయాలని, జిఎం బ్రాంచ్ సెక్రటరీ సాయి కృష్ణ, ఏలిపిలో కార్మికులు పడుతున్నటువంటి ఇబ్బందులను టాయిలెట్స్, ఆరో వాటర్ ప్లాంట్ తో పాటు మాలిక వసతులని ఏర్పాటు చేయాలని జిఎం స్ట్రక్చర్ మీటింగ్లో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పిక్ కార్యదర్శులు మెడగాని వెంకటేష్, సర్వన్, నాయకులు జుబేర్, నరేందర్ ప్రేమ్, రాజు, వెంకటేష్, సతీష్, అంజి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం నవంబర్ 29 2024

# ఓటీటీలో కిరణ్ అబ్బవరం క

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం రీసెంట్‌గా క సినిమాతో ప్రేక్షకులను పలుకరించాడని తెలిసిందే. 1970 ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణగిరి గ్రామం నేపథ్యంలో సాగే పీరియాడిక్ థ్రిల్లర్‌గా పాన్ ఇండియా కథాంశంతో వచ్చిన ఈ చిత్రం ఈ మూవీ తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా రిలీజై హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ మూవీని థియేటర్లలో మిస్సయిన వారి కోసం డిజిటల్ ఎంట్రీ అప్‌డేట్ వచ్చేసింది. ప్రస్తుతం క పాపులర్ ఓటీటీ ప్లాట్‌పాం ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ ఎక్స్‌పీరియన్స్ అందించేందుకు క డాల్బీ విజన్‌లో సందడి చేస్తుండటం విశేషం. ఈటీవీ విన్‌లో డాల్బీ విజన్‌లో స్ట్రీమింగ్ అవుతున్న తొలి సినిమాగా అరుదైన ఫీట్ నమోదు చేసింది క. ఇంకేంటి మరి డాల్బీ విజన్‌లో మీరూ చూసేయండి. సుజిత్-సందీప్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రంలో 2018 ఫేం తాన్వీ రామ్, గం గం గణేశా ఫేం నయన్ సారిక ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషించారు. వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కించిన ఈ మూవీకి శ్యామ్ సీఎస్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించాడు.



# పారడైజ్‌తో ప్రేక్షకుల ముందుకు నాని

మోహన్‌బాబు, నానిల మధ్య రసవత్తర సన్నివేశాలు


సరిపోదా శనివారం సినిమా సక్సెస్‌తో ఫుల్ జోష్ మీదున్నాడు టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నటిస్తోన్న2. హింస, రక్తపాతం, తుపాకులు. గ్లోరీ, ఒక మనిషి.. అంటూ ది ప్యారడైజ్ టైటిల్ లుక్ విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్న ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. త్వరలోనే నాని సెట్స్‌లో జాయిన్ కాబోతున్నాడు. కాగా ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు మెయిన్ విలన్‌గా కనిపించబోతున్నాడట. అంతేకాదు మరో పాపులర్ తెలుగు యాక్టర్ కీ రోల్‌లో నటిస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఇంతకీ ఎవరా నటుడనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఇదే నిజమైతే సిల్వర్ స్క్రీన్‌పై మోహన్ బాబు-నాని పోరు ఎలా ఉండబోతున్నది సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. హై ఎనర్జిటిక్ యాక్షన్ ప్యాక్డ్ రోల్‌లో కనిపించబోతున్నాడట. భారీ స్థాయిలో రాబోతున్న ఈ సినిమా హీరోయిన్, ఇతర వివరాలకు సంబంధించి మరిన్ని అప్‌డేట్స్ పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.




## తలైవా బర్త్‌డే గిఫ్ట్...

# జైలర్-2 షూటింగ్ షురూ..!

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్- కోలీవుడ్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబోలో వచ్చిన జైలర్ బాక్సాఫీస్ ఏ స్థాయిలో షేక్ చేసిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ సూపర్ హిట్ చిత్రానికి సీక్వెల్ జైలర్ 2 కూడా వస్తుందని తెలిసిందే. చాలా రోజుల తర్వాత ఆసక్తికర వార్త ఒకటి తెరపకి వచ్చింది. సీక్వెల్ షూటింగ్‌కు అంతా రెడీ అయినట్టు కోలీవుడ్ సర్కిల్ సమాచారం. తాజా టాక్ ప్రకారం జైలర్ 2 ప్రోమో షూట్‌ను డిసెంబర్ 5న జరుపనున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు తలైవా పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 12న జైలర్ 2 ప్రోమోతోపాటు కూలీ న్యూ లుక్ పోస్టర్‌ను విడుదల చేసేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. ఇదే నిజమైతే అభిమానులు, మూవీ లవర్స్‌కు పండగే అని చెప్పొచ్చు. జైలర్ 2 స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని ఇప్పటికే నెల్సన్ దిలీప్ కుమార్ క్లారిటీ ఇచ్చాడని తెలిసిందే. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి , మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారు. మరి వీరంతా సీక్వెల్‌లో కూడా ఉంటారా..? అనేది తెలియాల్సి ఉంది. దీనిపై మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. రజినీకాంత్ మరోవైపు లోకేశ్ కనగరాజ్ డైరెక్ట్ చేస్తున్న కూలీ సినిమాతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీ 2025లో గ్రాండ్‌గా విడుదల కానుంది.






# టీం అందరినీ మిస్ అవుతున్నా : రష్మిక

పుష్ప-2' షూటింగ్‌ను గత సోమవారం రోజున ముగించిన విషయం తెలిసిందే. దాదాపు రెండు సంవత్సరాలుగా సాగిన షూటింగ్‌కు ఆ రోజు గుమ్మడికాయ కొట్టేశారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్ ఇండియా చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా షూటింగ్ తాలూకు జ్ఞాపకాలను తలచుకొని ఉద్వేగానికి గురైంది కథానాయిక రష్మిక మందన్న. షూటింగ్ చివరి రోజు ఇక తాను సెట్‌లోకి రాలేనని తెలిసి ఎమోషనల్‌గా ఫీలయ్యానని రష్మిక మందన్న తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పేర్కొంది. 'నవంబర్ 25 నా జీవితంలో భావోద్వేగభరితమైన రోజు. షూటింగ్ చివరి రోజు అని తెలిసి చాలా బాధపడ్డాను. ఆఖరి రోజు ఓ స్పెషల్‌సాంగ్ షూట్ చేశాం. రాత్రి వరకూ సెట్‌లోనే ఉన్నా. గత ఐదేళ్లుగా ఈ టీమ్‌తో కలిసి ప్రయాణం చేస్తున్నా కాబట్టి అది సెట్‌లాగా అనిపించలేదు. అది నా ఇల్లులా మారింది. అప్పటివరకు సినిమా కోసం పడిన కష్టం, షూట్ సమయంలోని ఎన్నో జ్ఞాపకాలు ఒక్కసారిగా కళ్లముందు కదలాడాయి. షూటింగ్ పూర్తయిందనే సంతోషం ఓ వైపు, సెట్‌ను విడిచిపోతున్నానే బాధ మరో వైపు..ఇలా ఎన్నో భావోద్వేగాలతో నా మనసు నిండిపోయింది. టీమ్ అందరిని మిస్ అవుతున్నాననే బాధతో ఒక్కసారిగా కన్నీళ్లొచ్చాయి. నేను చాలా రోజుల తర్వాత ఏడ్చాను. అలా ఎందుకు ఫీల్ అయ్యానో అర్థం కాలేదు. గొప్ప టీమ్‌తో పనిచేసినప్పుడు వారితో తెలియని అనుబంధం ఏర్పడుతుంది. ఆ ఫీలింగే నన్ను కదిలించింది' అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొంది.



# ఇది నాకు చాలా స్పెషల్..

## - మానుషి చిల్లార్

గోవాలోని పణజీలో భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ)లో ప్రదర్శన ఇవ్వడంపై నటి మానుషి చిల్లార్ స్పందించారు. ఇది తనకెంతో ప్రత్యేకమన్నారు. దాదాపు రెండేళ్ల క్రితం తాను ఈ వేడుకల్లో పాల్గొన్నానని అన్నారు."సినిమా అనేది చాలా విభిన్నమైన రంగం. మాది సినీ నేపథ్యం ఉన్న కుటుంబం కాదు. అనుకోని విధంగా నేను పరిశ్రమలోకి అడుగుపెట్టా. ఇండస్ట్రీలోకి వచ్చినప్పుడు పరిస్థితులు ఎంతో విభిన్నంగా ఉన్నాయి. ఏది ఏమైనా నా వృత్తికి న్యాయం చేయాలనుకున్నా. ఇచ్చిన పాత్రకు అనుగుణంగా యాక్ట్ చేయాలని నిర్ణయించుకున్నా. ప్రతి రోజూ కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నా. చిన్నతనంలో ఎన్నో సందర్భాల్లో స్టేజ్ ప్రదర్శనలు ఇచ్చా. స్టేజ్‌పై డ్యాన్స్ చేయడమంటే నాకెంతో ఇష్టం. దాదాపు పదేళ్ల తర్వాత ఈవిధంగా ప్రదర్శన ఇవ్వడం ఆనందంగా అనిపించింది. మరీ ముఖ్యంగా, ఈ వేడుకలో నా తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. వారి ఎదురుగా ప్రదర్శన ఇచ్చినందుకు చాలా ప్రత్యేకంగా అనిపించింది. దాదాపు రెండేళ్ల క్రితం ఇఫ్ఫీలో పాల్గొన్నా. ఆ సమయంలో ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నా. వివిధ భాషలకు చెందిన సినీ ప్రముఖులందరూ ఒకేచోట కలుసుకుని సినిమాని సెలబ్రేట్ చేయడం ఎంతో బాగుంది" అని మానుషి తెలిపారు.అనంతరం బాక్సాఫీస్ గురించి మాట్లాడారు. 'థియేటర్‌లో ఆడిన రోజులను ఆధారంగా చేసుకుని గతంలో సినిమా హిట్ లేదా ఫ్లాప్ అనేది నిర్ణయించేవారు. ఆతర్వాత వీకెండ్ కలెక్షన్స్, రూ.100 కోట్ల క్లబ్.. ఇలా ఎప్పటికప్పుడు ప్రమాణాలు మారిపోతున్నాయి. ఏది ఏమైనా ఇదొక బిజినెస్. పెట్టిన పెట్టుబడికి తప్పకుండా లాభాలు రావాలి' అన్నారు.హరియాణాకు చెందిన మానుషి చిల్లర్.. 2017లో మిస్‌వరల్డ్‌గా నిలిచారు. అనంతరం ఆమె సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. అక్షయ్‌కుమార్ హీరోగా నటించిన 'సామ్రాట్ పృథ్వీరాజ్' ఆమె తొలి చిత్రం. 'ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ', 'బడే మియా ఛోటే మియా' చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం జాన్ అబ్రహం హీరోగా తెరకెక్కుతోన్న 'టెహ్రాన్' కోసం వర్క్ చేస్తున్నారు. కథానాయికగా తాను విభిన్నమైన చిత్రాల్లో నటించాలనుకుంటున్నానని గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.